# యోగం లేదు

ఆ రోజు ఆదివారం.

సెలవురోజు గాబట్టి, కాస్త ఆలస్యంగానే బయల్దేరి కూరగాయల మార్కెట్టులో అడుగుపెట్టాను.

మార్కెట్టు రద్దీగానే వుంది.

ఓ చోట, రమణయ్య వంకాయలు బేరం చేస్తూండటం చూసి, నేరుగా అక్కడికి వెళ్ళాను.

"నమస్కారం రమణయ్యగారు" అన్నాను.

"నమస్కారం" ముక్తసరిగ అన్నాడాయన. ముళ్ళమీద నిల్చుని అన్నట్లుగానే వున్నాయా మాటలు.

"ఎలా అంటున్నాడండీ వంకాయలు?" మళ్ళీ ప్రశ్న వేశాను.

"ఇంకా బేరం కుదరలేదండీ!" వాటిలో మంచివి యెంచుతున్నాడు.

కుప్పగా పోసిన వంకాయల కేసి పరీక్షగా, చూశాను. బాగా వాడి వున్నయ్. అక్కడక్కడ నల్లని మచ్చలేర్పడ్డాయి. తాజా కాయలు కావని, క్రితం రోజువయ్యుంటాయని ఖచ్చితంగా చెప్పేయొచ్చు. అందుకే, నాకు నచ్చలేదు. ఓ పదిపైసలు యెక్కువయినా, తాజా కాయలు తీసుకెళ్తే తృప్తిగా వుంటుంది.... నాలో నేనే యిలా అనుకున్నా, అవి వాడిపోయిన వంకాయలని రమణయ్య గారితో చెప్పడానికి సభ్యత అడ్డొచ్చింది.

"మరోచోట చూసి వస్తా నుండండి" అంటూ అక్కణ్ణించి జారుకున్నాను.

"మంచిది" ఓ పెద్ద రిలీఫ్ వచ్చినట్టుగా అన్న ఆ సమాధానం నాకు వినిపించింది.

రమణయ్య అటువంటి చౌకబారు వంకాయలు కొంటున్నందుకు, అతని పట్ల వల్ల మాలిన జాలి కలిగింది నాకు, చుట్టు పక్కల నిగనిగలాడే, తాజా వంకాయలు కనిపిస్తూన్నా, అతను అటువంటి వాడిన వంకాయలు కొంటున్నాడంటే, బహుశా ఆర్థిక పరిస్థితి అంత బాగులేదేమో!

కుటుంబ భారం అధికంగా వుండొచ్చునేమో ... అనిపించింది నాకు. నిజమే మరి! ఆపాటి పొదుపు చెయ్యకపోతే, యెక్కువ మంది వున్న సంసారాన్ని యీడ్చుకు రావడం, యీ రోజుల్లో దుస్సాధ్యమే. అంతేకాదు- రమణయ్య వేసుకున్న దుస్తులు చూసినా, వేసుకున్న చెప్పులు చూసినా, అతని పేదరికం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది పాపం. కుటుంబ పోషణ కోసం, తన సుఖాల్నీ, అవసరాల్నీ విస్మరిస్తోన్న అతని పట్ల జాలి యినుమడించింది. మధ్యతరగతి కుటుంబాల్లో చాలా మంది యిటువంటి దీనస్థితికి గురవుతున్నారేమో ననిపించింది.

ఈ ఆలోచనల నుంచి బైటపడకుండానే, శంకర్రావు యెదురయ్యాడు.

"ఏవిఁటండోయ్ రావుగారూ, పరధ్యానంగా యేదో ఆలోచిస్తూ పోతున్నారు! మార్కెటులో యింత పరధ్యానంగా తిరిగారంటే, మీ జేబు కాళీ అయిపోగల్దు జాగ్రత్త...." చిరునవ్వుతో అన్నాడు శంకర్రావు.

"ఆఁ... ఆఁ - మీరన్నది నిజమేననుకోండి అదిగో ఆ వంకాయల దుకాణం దగ్గర రమణయ్యగార్ని కలిశాను. అతని గురించి ఆలోచిస్తూ, పరధ్యానంలో పడిపోయాను..." అన్నాను మెల్లిగా.

"అతని గురించి మీరు ఆలోచించడమెందుకండీ!" ఆశ్చర్యపోయినట్లు అడిగాడతను.

"ఎందుకేవిఁటండీ శంకర్రావుగారూ? ఆఫ్టరాల్, అతను మన కొలీగ్. అతని బాధలూ, బాధ్యతలు గురించి మనం ఆలోచించడంలో తప్పేంలేదు. చూడండి. అతనెల్లాంటి చౌకబారు వంకాయలు కొంటున్నాడో! ఆర్థికపరమైన యిబ్బందుల వల్లనేగా! లేకపోతే, మంచి తాజా వంకాయలే కొనేవాడు. యింతేనా? అతను వేసుకొనే దుస్తులు, చెప్పులు, తైల సంస్కారంలేని ఆ చింపిరి జుత్తు, మాసిన గడ్డం... యెల్లప్పుడూ దైన్యం తాండవ మాడుతూ వుండే అతని మొహం యివన్నీ చూస్తూంటే, పాపం- అతనికి సంసార బాధ్యతలు తలకు మించినట్టుగా వున్నాయని, యిట్టే పసిగట్టేయొచ్చు. అందుకే, అతణ్ణి చూస్తూవుంటే, నాకు జాలి కలుగుతూ వుంటుంది రియల్లీ, ఐ పిటీ హిమ్" అన్నాను, సానుభూతి ప్రకటిస్తూ.

శంకరావు ఫకాల్న నవ్వేడు. రమణయ్య పట్ల, అతని దీనావస్థ పట్ల జాలి చూపడం మానేసి, ఇతనెందుకలా నవ్వేడో నా వూహకి అందలేదు. రమణయ్య ఆసహాయతను అతను కావాలనే వెక్కిరిస్తున్నట్టనిపించింది నాకు. బాధతో పాటు, చిరుకోపం వచ్చింది.

"అతని పరిస్థితికి జాలిపడ్డం మానేసి, ఇలా నవ్వుతారేమిటండీ, శంకరావుగారూ? వేళాకోళంగా వుందా?" సీరియస్‌గా మొహం పెట్టి, అన్నాను.

శంకర్రావు నా మొహంలో కనిపిస్తోన్న కోపాన్ని చూసి చకితుడయ్యాడు.

"నవ్వుగాక, యేవిఁటండీ? రమణయ్యగారి గురించి మీకు తెలిసింది చాలా తక్కువ గాబట్టి, అతని బాహ్య స్వరూపం చూసి, మీరు యింతగా జాలి ప్రకటిస్తున్నారు. తోటి వుద్యోగి కష్టాల్లో వున్నాడని, వూరికే బాధపడి పోతున్నారు. కాని, ఇతని గురించి పూర్తిగా మీకు తెలిస్తే, మీ లోని 'జాలి' మంచు ముక్కలా కరిగిపోయి, అతన్ని విపరీతంగా అసహ్యించుకుంటారు" అన్నాడు శంకర్రావు.

శంకర్రావు అభిప్రాయం ఏవిఁటో, నాకేం అర్థం కావటంలేదు.

"అంటే..?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"మీరు భావిస్తున్నట్టు, రమణయ్యగారికేం తలకు మించిన సంసార బాధ్యతలు లేవు ఆర్థికపరమైన యిబ్బందులు అంతకంటె లేవు. ఆ మాటకొస్తే, ఆర్థికంగా అతనికున్న అంతస్తు, స్టెబిలిటీ, మనలో ఎవ్వరికీ లేవంటే, మీరు విస్తుపోతారు. కాని, అది అక్షరాలా నిజం."

నిజంగానే, ఆశ్చర్యంలో ఓ క్షణంపాటు అవాక్కయ్యాను. నేను. శంకర్రావు చెబుతున్నది నిజమేనా?... నమ్మలేకపోతున్నాను.

"ఏవిఁటి మీరంటున్నది శంకర్రావుగారూ?" కళ్లింతవి చేసుకుని, ప్రశ్నించాను.

శంకర్రావు, సన్నగా మందహాసం చేశాడు."నిజం రావుగారూ! నేను చెప్పిందాంట్లో అబద్ధంగాని, అతిశయోక్తిగాని లేమాత్రం కూడా లేదు. అతని బ్రతుకే అంత! మీరు కొత్తగా వచ్చినవాళ్లు కాబట్టి రమణయ్య గార్ని గురించి మీకంతగా తెలీదు. అతను నాకు గత పదేళ్లుగా తెలుసు. అవకాశాలు వుండి కూడా, అనుభవించే యోగం అతనికీ జీవితంలో లేదేమోననిపిస్తుంది. ఆలోచిస్తే! కడుపునిండా తినడు. ఇంట్లో వాళ్లనీ తిననివ్వడు. తాను తెచ్చిన దాంట్లోనే సరిపెట్టుకోమంటాడు. ఎవరికీ సరైన దుస్తులుండవు. సరదాలు అసలే వుండవు. ఏమైనా అంటే 'పొదుపు' అంటూ పాట పాడుతాడు. కేవలం డబ్బు వెనకేయడమే అతని లక్ష్యం. అదే అతని ధ్యేయం. ఒక్కొక్కప్పుడు ఇంట్లో వాళ్లు విసిగిపోతూ వుంటారని వనికిడి." అంటూ నాకు పూర్తిగా తెలీని రమణయ్య మనస్తత్వాన్ని క్లుప్తంగా చెప్పాడు.

నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. ఇదంతా నిజమేనా?... శంకర్రావు అన్నట్టు నాలో రమణయ్య పట్ల గల జాలి, సానుభూతి మంచుముక్కగా కరిగిపోయి, ఆ స్థానంలో చిక్కటి అసహ్యం చోటు చేసుకుంది.

"అయితే రమణయ్య అంత పిసినారా?"

"అనే అంతా అంటారు మరి?"

"పోనీ, అలాగయినా సంపాదించాడంటారా?"

"ప్రతి పైసానీ పాపాయిలా చూసుకునే అటువంటివాళ్లు సంపాదించపోతే, యింకెవరు సంపాదిస్తారండీ! మీకు తెలీదుగా! నేను విన్నంతవరకూ అతనికి బ్యాంకులో అరవై వేలుందిట..."

విస్తుపోయాన్నేను.

"అంత డబ్బు వుంచుకుని, యీ ఖర్మేవిఁటి? డబ్బు లేనివాడిలా ఎందుకలా పేదరికాన్ని అనుభవించాలి? కడుపునిండా తిండీ, కట్టుకుందుకు మంచి బట్టలు నోచుకోలేని అతని బ్రతుకులో డబ్బుకు విలువేముందండీ?" అన్నాను.

" ఆ విలువేవిఁటో అతనికే తెలియాలి మరి! అయినా, అనుభవించే యోగం లేనప్పుడు, యిల్లాంటి బుద్ధులే పుడుతూంటాయి. నొసట రాసిందెవ్వరూ తప్పించుకోలేరండీ! మీరన్నారే 'ఖర్మ' అని.... అదే కరెక్టయిన డెఫినిషన్" నవ్వుతూ అన్నాడు శంకర్రావు.

శంకర్రావు చెప్పింది అక్షరాలా నిజమనిపించింది. రమణయ్యపట్ల నాకు అసహ్యంతో కూడిన ఆవేశం పెల్లుబికింది. అతని దగ్గరికి వెళ్లి చెడామడా, తిట్టేయాలన్నంత వుక్రోషం వచ్చింది. కాని, హద్దుమీరి ప్రవర్తించకూడదన్న యింగితానికి లోబడి, ఆవేశాన్ని బలవంతంగా అణచుకున్నాను. డబ్బు చాలక పేదరికాన్ని అనుభవిస్తున్న వాళ్లు కొందరైతే, డబ్బుండి కూడా కటిక ధారిద్ర్యాన్ని కౌగిలించేకునేవాళ్లు కొందరుంటారేమోననిపించింది. ఎంత చిత్రమైన లోకం! "శంకర్రావుగారూ, ఒక నిజాన్ని చెప్పి నాకు చాలా వుపకారం చేశారు. వస్తానుండండి... వేళవుతోంది..." అంటూ ముందుకు సాగిపోయాను.

‘‘‘

ఆ రోజు నుంచీ, రమణయ్యను చూస్తే జాలి కలగడం లేదు సరిగదా, ఒకవిధమైన జుగుప్స యేర్పడింది. నా యీ జుగుప్స అతని కేవిధంగానూ హాని చెయ్యపోయినా, యిన్నాళ్లూ నాలో నిండిన 'జాలి'ని శాశ్వతంగా మింగివేసింది.

□□□

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక -7-5-82)